ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
ఆదివారం 11 ఫిబ్రవరి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.144	209	238
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.144	209	238

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 । కనిష్ఠం 21.0

ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క శనివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకే ప్రాధాన్యం దక్కింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ఆరు గ్యారెంటీలకు ఈ బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.2లక్షల పరిమితితో రుణమాఫీ చేస్తామని వెల్లడించారు. చేనేత కార్మికులకు ఊరట కలిగించేలా వారి వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలుచేసేందుకు నూతన పాలసీని రూపొందించనున్నట్లు ప్రకటించారు. మొత్తంగా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అయినా, ప్రధాన రంగాలను దృష్టిలో ఉంచుకొని కేటాయింపులు జరిగాయని పలువురు విశ్లేషిస్తున్నారు.

– (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)





ఆరు గ్యారెంటీలకే పెద్దపీట

- విద్యారంగంలో సంస్కరణల దిశగా బడ్జెట్ కేటాయింపులు
- గురుకులాలు, హాస్టళ్లకు సొంతభవనాలకు నిధులు
- ఉద్యోగ కల్పన కేంద్రాలుగా ఐటీఐల మార్పు
- రైతాంగానికి వరాల జల్లు
- అధికార, ప్రతిపక్షాల భిన్న స్పందనలు

విద్యారంగం బలోపేతానికి ప్రత్యేక నిధులు



ప్రతీ మండలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్‌స్కూల్స్ ఏర్పాటు చేస్తామని భట్టి ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు, హాస్టళ్లకు నూతన సొంత భవనాల నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో భారీగా నిధులిచ్చారు. ప్రతీపాఠశాలలో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా ఐటీఐ కళాశాలల్లో ఉపాధి కల్పన కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. అందుకు పైలట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో 65 ఐటీఐలను అంతర్జాతీయ సంస్థలతో కలిసి ఆధునిక కోర్సుల నిర్వహణకు ఎంపికచేయనున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు ఉపాధి దక్కుతుందని మంత్రి వెల్లడించారు.

గ్యారెంటీల అమలుకే ప్రాధాన్యం

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల అమలుకే ఈ బడ్జెట్‌లో రూ.53,196కోట్ల నిధులు కేటాయించడం గమనార్హం. 200 యూనిట్ల విద్యుత్ వినియోగదారులకు గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ అందించనున్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ కొనసాగుతుందని ఆర్థికశాఖ మంత్రి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తిరిగి అమలులోకి తీసుకురానున్నారు. అన్ని ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బందిని నియమించడం ద్వారా మారుమూల ప్రాంతాల్లో సైతం ఆధునిక వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. గ్రామీణ పేదలకు సైతం నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తేవడమే లక్ష్యమని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10లక్షల పరిమితికి పెంచామని అసెంబ్లీలో ఆర్థికశాఖ మంత్రి భట్టి ప్రకటించారు.

రైతులను ఆకర్షించే పథకాలు



రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీని త్వరలో అమలుచేస్తామని భట్టి ప్రకటించారు. అదేవిధంగా రైతుబంధు పథకాన్ని సమీక్షించున్నారు. పెట్టుబడిదారులు, రియల్ వ్యాపారులు కొనుగోలు చేసిన భూములకు రైతుబంధు ఇచ్చేది లేదని తేల్చారు. అర్హులైన రైతులందరికీ ఎకరాకు ఏడాదికి రూ.15వేల పెట్టుబడిసాయాన్ని రైతుభరోసా కింద అందించనున్నారు. కౌలురైతులకు సైతం రైతుభరోసా, రైతుబీమా వర్తింపజేయనున్నారు. ధరణి పోర్టల్‌లో అవకతవకలపై నియమించిన నిపుణుల కమిటీ నివేదిక వచ్చాక రెవెన్యూశాఖను ప్రక్షాళనచేస్తామని అసెంబ్లీ సాక్షిగా ఆర్థిక మంత్రి పేర్కొనడంతో ధరణి పోర్టల్ రూపురేఖలు మారనున్న విషయం స్పష్టమవుతోంది. ప్రధాని ఫసల్‌బీమా యోజనతో కలిపి రైతులకు పంటల బీమా పథకాన్ని అమలు చేయనున్నారు.

మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుకు రూ.1,000కోట్లు

హైదరాబాద్, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యధిక భాగం ప్రవహించే మూసీ నది ప్రక్షాళనకు థేమ్సనది తరహాలో రివర్‌ఫ్రంట్ బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్థికశాఖ మంత్రి భట్టి తెలిపారు. అందుకోసం ప్రాథమికంగా రూ.1,000కోట్లు కేటాయించామని ప్రకటించారు.





పంచాయతీల స్వయం పాలనకు గ్రీన్‌సిగ్నల్

గ్రామపంచాయతీల బలోపేతానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్థిక మంత్రి ప్రకటించారు. పంచాయతీలు స్వయం సమృద్ధి కేంద్రాలుగా ఎదిగేందుకు అవసరమైన అన్నిరకాల సహాయ, సహకారాల్ని అందిస్తామని తెలిపారు. గ్రామస్వరాజ్యం నినాదానికి తాము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.

ఇది ప్రజా బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రజాబడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం బడ్జెట్‌లో కేటాయింపులు భారీగా జరిగాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం దక్కింది. ప్రజలతో ఎంపికైన ప్రజాప్రభుత్వంలో గతానికి భిన్నంగా పెద్ద మొత్తంలో కేటాయింపులు చేయడం హర్షనీయం. ప్రజలు కోరుకున్నవిధంగా బడ్జెట్ ఉంది.

– కె.శంకర్‌నాయక్, డీసీసీ నల్లగొండ అధ్యక్షుడు

పేదలను విస్మరించిన బడ్జెట్



ఎంతో గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బడ్జెట్ కేటాయింపుల్లో ప్రజలను మోసం చేసింది. పేద వర్గాలకు, బడుగు, బలహీనవర్గాలకు ప్రాధాన్యం ఇచ్చే ఎలాంటి పథకాలు, కేటాయింపులు లేకపోవడం శోచనీయం. రైతాంగాన్ని మోసం చేసే ప్రకటనలే తప్ప రుణమాఫీ, రైతుబంధుపై ఎలాంటి స్పష్టమైన కేటాయింపులు చేయలేదు. మొత్తానికి పేరుగొప్ప ఊరుదిబ్బలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి.

– రవీంద్రకుమార్, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు

బడ్జెట్ అంకెల గారడీ



రాష్ట్ర బడ్జెట్ కేవలం అంకెల గారడీ మాత్రమే. రుణమాఫీపై ఏమాత్రం స్పష్టత ఇవ్వలేదు. రుణమాఫీకి నిధులు కేటాయించలేదు. వ్యవసాయరంగం నిధుల్లో కోత పెట్టారు. ఏ ఒక్క వర్గానికి కూడా న్యాయం చేసేలా బడ్జెట్‌ను రూపొందించలేదు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. ప్రజలను వంచించే విధంగా బడ్జెట్ ఉంది.

– నాగం వర్షిత్‌రెడ్డి, బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు

ప్రజా సంక్షేమానికి ఖర్చు చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులను ప్రజా సంక్షేమానికి ఖర్చు చేయాలి. గత ప్రభుత్వం మాదిరిగానే వెనుకబడిన ప్రాంతాలను ఈ ప్రభుత్వం విస్మరించినట్టు కన్పిస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై ఉన్న చిత్తశుద్ధి మిగిలిన సమస్యలపై లేదు. రుణమాఫీ, రైతుబంధు, రైతుభరోసా ఎప్పటి వరకు అమలు చేస్తారో చెప్పలేదు.

– ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి

ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలి



పభుత్వం ప్రజా సంక్షేమం కోసం కృషి చేయాల్సి న అవసరం ఉంది. బడ్జెట్‌లో కేటాయింపులకు అనుగుణంగా ఖర్చు చేయాలి. వ్యవసాయరంగం కోసం పెట్టుబడులు మరింత పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వ్యవసాయరంగంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలి.

– కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, టీడీపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు

రాష్ట్ర బడ్జెట్ ఆశాజనకం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ఆశాజనకంగా ఉంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలపై బడ్జెట్‌లో నిదులు కేటాయించారు. సాగునీటి ప్రాజెక్టులకు రూ.28వేల కోట్లు కేటాయించడం హర్షనీయం. జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల పథకాల్లో భాగంగా చర్లగూడెం రిజర్వాయర్, బ్రాహ్మణవెల్లంల ఉదయసముద్రం సత్వరమే పూర్తిచేస్తే జిల్లా సస్యశ్యామలమవుతుంది.

– నెల్లికంటి సత్యం, సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి

ఆత్మహత్యలపై స్పందనేదీ? : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



భవ్యశ్రీ, వైష్ణవి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రవీణ్‌కుమార్

•7లో..

నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు

అదనపు కలెక్టర్ వీరారెడ్డి



అంగన్‌వాడీ టీచర్లను వివరాలు అడుగుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 10: రాబోయే వేసవిలో గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా నీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని రాయిపల్లిలో జరుగుతున్న పనులను అదనపు కలెక్టర్ వీరారెడ్డి పరిశీలించారు. అనంతరం ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల్లో తప్పుగా పడిన గ్యాస్ కనెక్షన్ నెంబర్లను తిరిగి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న వివరాలపై ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎన్ని గ్యాస్ కనెక్షన్ల వివరాలు ఎంట్రీ చేశారని అంగన్‌వాడీ టీచర్లను అడిగి తెలుకున్నారు. మండలంలో 3,871 కనెక్షన్లకు 2,090 నమోదు చేసినట్లు ఎంపీడీవో నిరంజన్ తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ మార్చి నుంచి గ్రామాల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు తగిన ప్రణాళికలతో సంబంధిత మండల గ్రామస్థాయి అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజాపాలనలో జిల్లాలో 2,68,500 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 84 వేల మంది గ్యాస్ కనెక్షన్ నెంబర్లు తప్పుగా ఉన్నట్లు గుర్తించామన్నారు. తప్పు నెంబర్లు ఉన్న లబ్ధిదారులు ప్రస్తుతం గ్రామంలో అందుబాటులో లేకపోయినా, ఫోన్ ద్వారా వారి వివరాలు తీసుకొని ఎంట్రీ చేయాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు.

కార్యాలయ సిబ్బందిపై ఆగ్రహించిన అదనపు కలెక్టర్

ఎంపీడీవో చాంబర్‌లోకి చెప్పులు వేసుకొని రావొద్దని ఆంక్షలు పెట్టిన సిబ్బందిపై అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీడీవో చాంబర్‌లో అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశానికి అంగన్‌వాడీ టీచర్లు చాంబర్ డోర్ వద్ద చెప్పులు వదిలి లోపలికి వెళ్లారు. అయితే గమనించిన అదనపు కలెక్టర్ చెప్పులు బయట ఎందుకు వదిలి వచ్చారని ప్రశ్నించగా, పోయిన ఎంపీడీవో యాదగిరి ఉన్నప్పుడు చెప్పులు బయట వదిలి రావాలని బోర్డు పెట్టారని, ఇప్పుడు కూడా అలానే అనుకొని వదిలి వచ్చామని టీచర్లు చెప్పారు. దీంతో కార్యాలయ సిబ్బందిపై అదనపు కలెక్టర్ సీరియస్ అయ్యారు. సమావేశంలో డీటీ షఫియొద్దీన్, ఆర్ఐ మల్లికార్జునరావు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

మోటకొండూర్: ప్రత్యేక పారాశుధ్య వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆరెగూడెం, గిరబోయినగూడెం, సికింద్రనగర్‌లో పారిశుధ్య పనులను, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ చుట్టూ బయో ఫిన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో వీరస్వామి, పంచాయతీ కార్యదర్శులు స్వాతి, సోఫియా, ఏఎన్ఎంలు ధనమ్మ, యాకయ్య, అంగన్‌వాడీ టీచర్ జోజమ్మ, వాణి ఉన్నారు.

యాదగిరిక్షేత్రంలో దిద్దుబాటు చర్యలు



డార్మెటరీ హాల్ కోసం దర్శన క్యూకాం ప్లెక్స్ మెట్లదారిని తెరిచిన అధికారులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 10: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో దిద్దుబాటు చర్యలను అధికారులు ఆరంభించారు. ఆలయ ఉద్ఘాటన జరిగి దాదాపు రెండేళ్లు పూర్తి కావస్తున్నా క్షేత్రంలో భక్తుల మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ఏ మాత్రం దృష్టి సారించలేదని, దీంతో ఇష్టదైవాల దర్శనాలకు వచ్చిన యాత్రాజనులు ఇబ్బందులు పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు గత ఏడాది డిసెంబరు నెలలో యాదగిరిక్షేత్రాన్ని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ అనిల్‌కుమార్ సందర్శించి సమస్యలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని దేవస్థాన అధికారులను ఆదేశించారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వివిధ శాఖల అధికారులతో కలిసి యాదగిరికొండపై పలు ప్రాంతాల్లో కలియదిరిగి పరిశీలించి పోలీసు, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, దేవాదాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులు, స్థానికల నుంచి విమర్శలు, ప్రజాప్రతినిధుల ఆదేశాల మేరకు భక్తుల సౌకర్యాల కల్పనకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం కొండపైన దర్శన క్యూకాంప్లెక్స్‌లో వసతుల కల్పన,మొక్కు టెంకాయ సమర్పణకు శాశ్విత స్థలాలు, మెట్ల దారిలో వచ్చే భక్తుల కోసం మార్గ మధ్యలో షెడ్ల నిర్మాణం, అవసరమైన ప్రదేశాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు, ఏటీ ఎం ఏర్పాటు, బస చేసేందుకు దర్శన క్యూకాంప్లెక్స్ ను డార్మెటరీ హాల్‌గా తీర్చిదిద్దేందుకు సన్నాహాలు ఆరంభించారు.

తీరనున్న భక్తుల కష్టాలు

యాదగిరికొండను దర్శించే భక్తులకు సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం పూనుకుంది. ఆర్టీసీ బస్సులతో పాటు ఆటోలు సైతం కొండపైకి నడవనుండడంతో రవాణా సమస్యలు తీరినట్టేనని భక్తులు భావిస్తున్నారు. అదేవిధంగా దర్శన క్యూకాంప్లెక్స్‌లో సమస్యలకు పరిష్కారానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీంతో నాలుగు అంతస్థుల్లోని దర్శన క్యూలైన్లలో వెళ్లేందుకు ఇబ్బందులు తగ్గనున్నాయి. కొండకు చేరుకున్న భక్తులకు అవగాహన కల్పించేందుకు సూచిబోర్డులు త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు. కొండపైన విష్ణుపుష్కరిణిని నీటితో నింపనుండడంతో పురాతన సంప్రదాయాలకు పూర్వ వైభవం రానుంది. కొండపైన అవసరమైన ప్రాంతాల్లో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో కొండపైన బస్‌బే వద్ద ఏటీఎం సేవలు త్వరలో ఆరంభంకానున్నాయి.

మొక్కుటెంకాయ సమర్పణకు శాశ్వత స్థలం

యాదగిరికొండకు వచ్చే భక్తులు మొక్కు టెంకాయను సమర్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానాలయ తూర్పు రాజగోపురం ముందున్న బంగారు లోహపు క్యూలైన్లలోనే భక్తులు టెంకాయ మొక్కు చెల్లించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో గత కొంత కాలంగా నెలకొన్న మొక్కుటెంకాయ సమర్పణ సమస్య తీరనుంది. కాగా వీఐపీ టికెట్ దర్శన భక్తుల కోసం మరో ప్రాంతంలో టెంకాయ సమర్పణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

యాదగిరిక్షేత్రానికి పూర్వ వైభవం



యాదగిరిక్షేతానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకున్నాం. మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో కొండపైకి ఆటోలు అనుమతించాం. మొక్కు టెంకాయలు సమర్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను కల్పిస్తున్నాం. ఏటీఎం, భక్తుల బసకు డార్మెటరీ హాల్ సిద్ధమవుతున్నాయి. భక్తులు సులువుగా ప్రసాదాలు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోనున్నాం. సూచి బోర్డులు ఏర్పాటు చేసేందుకు అధికారులను ఆదేశించాం. దీంతో మిగతా పనులన్నింటినీ త్వరలో పూర్తిచేసి భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తాం.

– బీర్ల ఐలయ్య, ప్రభుత్వ విప్

భక్తుల కోసం డార్మెటరీ హాల్

భక్తులు బస చేసేందుకు డార్మెటరీ హాల్‌ను నాలుగు అంతస్థుల్లోని దర్శన క్యూకాంప్లెక్స్‌లో సిద్ధం చేస్తున్నారు. క్యూకాంప్లెక్స్ పైభాగంలో మూసివేసిన మెట్ల దారిని తిరిగి తెరిచారు. మెట్ల మార్గం పునరుద్ధరణతో పాటు బస చేసే భక్తుల కోసం లాకర్స్, టాయిలెట్స్ సౌకర్యాలను కల్పించనున్నారు. దీంతో కొండపైన నిద్ర మొక్కు తీర్చుకునే భక్తుల కోరిక నెరవేరనుంది.

నేటి నుంచి కొండపైకి ఆటోలు



యాదగిరికొండపైకి ఆదివారం నుంచి ఆటోలను అనుమతించనున్నారు. సుమారు మూడేళ్లుగా కొండపైకి ఆటోలు నిలిచాయి. మొదటి ఘాట్ రోడ్‌లో షిఫ్టుల వారీగా కొండపైకి ఆటోలు నడవనున్నాయి. ఒక్కో షిఫ్టులో 50 ఆటోలు, 25 కొండపైన, 25 కొండకింద ఉండాలని, ఆటో కార్మికులు నియమ నిబంధనలు పాటించాలని, ఉల్లంఘించిన వారిపై చర్యలు ఉంటాయని, నిరంతరం నిఘా నీడలో ఆటోలు నడవనున్నాయని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా మొదటి ఘాట్‌రోడ్‌లో మధ్యలో స్టాపర్స్ ఏర్పాటుతో పాటు విద్యుత్ స్తంభాల మరమ్మతులు పూర్తి చేశారు.

త్వరలో లోక్‌సభ ఎన్నికల మాక్‌పోల్

అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 10: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి త్వరలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్‌పోల్ నిర్వహించనున్నట్లు రెవిన్యూ అదనపు కలెక్టర్ ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం లోక్‌సభ సాధారణ ఎన్నికలకు సంబంధించి పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం యంత్రాల ప్రథమ దశ తనిఖీ పూర్తి కాగానే మాక్‌పోల్ నిర్వహించనున్నట్లు చెప్పారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లలో భాగంగా సెక్టార్ అధికారుల శిక్షణ పూర్తి అయ్యిందన్నారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచార కార్యక్రమాలకు ఉపయోగించే లౌడ్‌స్పీకర్, పోడియం, ఫ్లెక్సీ, క్లాత్ బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగ్, కటౌట్లు, వీడియోగ్రఫీ తదితర ప్రచార వాహనాలకు సంబంధించి ధరల కార్డు నిర్ణయించినందున సూచించిన ధరలకు ఎన్నికల ఖర్చు లోబడి ఉండాలన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉడుత భాస్కర్, మంగు నరసింహారావు, బట్టు రామచంద్రయ్య, కూర వెంకటేశ్, కొలుపుల గణేష్, సయ్యద్ ముల్తానీషా, సోమ రవీందర్‌రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం.నాగేశ్వరచారి, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

సాంఘీక సంక్షేమ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్‌రావు తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం రీజినల్ కో ఆర్డినేటర్ శ్రీరాం శ్రీనివాస్, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ జనరల్ గురుకులాలకు సంబంధించి ఐదో తరగతిలో చేరేందుకు గురుకుల విద్యాలయాల్లో ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. భువనగిరిలో 360, రాజాపేట 336, అడ్డగూడూరు 360, ఆలేరు 312, చౌటుప్పల్ 360, వలిగొండ 362, వలిగొండ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో 240 మందితో కలిపి 2,330 విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్ష సక్రమ నిర్వహణకు సిట్టింగ్ స్క్వాడ్ కూడా అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులకు తగిన సిటింగ్, విద్యుత్ లైట్లు, తాగునీటి వసతి, వైద్య సదుపాయం, పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీక్షలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ కే.పార్థసింహారెడ్డి పాల్గొన్నారు.

రోగులకు స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వాలి

డీఎంహెచ్‌వో పరిపూర్ణాచారి



పరిపూర్ణాచారికి వీల్ చైర్స్ అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 10: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మౌలిక వసతుల కల్పనకు స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వాలని జిల్లా వైద్యాధికారి పరిపూర్ణాచారి అన్నారు. రోటరీ క్లబ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్ యంపల్ల బుచ్చిరెడ్డి సమకూర్చిన 10 వీల్ చైర్లను శనివారం భువనగిరిలో అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంతో పోలిస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు, వసతులు మెరుగయ్యాయన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు పడమటి జగన్మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ చెన్న లక్ష్మణ్, వేమూరు అశోక్, కరిపే నర్సింగరావు, గౌలికార్ కిషన్‌జి పాల్గొన్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెకర్ల బదిలీ

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 10: చౌటుప్పల్ ఆర్డీవో జగన్నాథరావు జిల్లా స్పెషల్ డిప్యూటీ (ఎల్ఏ) కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఇదే హోదాలో ఇక్కడ పని చేసిన కే.నాగలక్ష్మి జహీరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. అదేవిధంగా గోదావరిఖనిలో స్పెషల్ డిప్యూటీ(ఎల్ఏ) కలెక్టర్‌గా పనిచేసిన జయశ్రీ బదిలీపై జిల్లాకు రానుండగా, ఇద్దరు ఇదే హోదాలో కొనసాగనున్నారు. ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ శనివారం ఉత్తర్వుల జారీ చేయగా, వారు సోమవారం విధుల్లో చేరనున్నారు.

‘హస్తం’ ఖాతాలోకి కోదాడ



బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ ప్రమీల

● చైర్‌పర్సన్‌గా ప్రమీల, వైస్ చైర్మన్‌గా కోటేశ్వరరావు ఎంపిక

కోదాడ, జనవరి 27: సూర్యాపేట జిల్లా కోదాడ మునిసిపాలిటీ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ ఖాతాలో చేరిపోయింది. కోదాడ మునిసిపాలిటీలో 35మంది కౌన్సిలర్లు ఉన్నారు. గత నెల 27న చైర్‌పర్సన్ వనపర్తి శిరీష, వైస్ చైర్మన్ వెంపటి పద్మపై అవిశ్వాస తీర్మానం పెట్టగా, 29 మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా ఓట్లు వేశారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లయ్యింది. ఫలితంగా వనపర్తి శిరీష, వెంపటి పద్మలు పదవిని కోల్పోయినట్లు ఆర్డీవో సూర్యనారాయణ తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం సూచనమేరకు ఎన్నికల అధికారి ఆర్డీవో శనివారం చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ పదవికి విశ్వాస పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 29 మంది హాజరుకాగా, ఐదుగురు గైర్హాజరయ్యారు. ఒకరు మృతి చెందారు. కాగా 2వార్డు నుంచి గెలిచిన సామినేని ప్రమీల చైర్‌పర్సన్‌గా, 6వ వార్డు నుంచి గెలిచిన కందుల కోటేశ్వరరావు వైస్ చైర్మన్‌లుగా ఎన్నికల అధికారి ఎన్నిక నిర్వహించారు. హాజరైన 29మంది కౌన్సిలర్లు వారికి అనుకూలంగా ఓటు వేయటంతోపాటు, ఏకగ్రీవంగా ఎన్నుకోవటంతో అధికారికంగా వారిపేర్లను ఆర్డీవో ప్రకటించారు. దీంతో చైర్‌పర్సన్‌గా సామినేని ప్రమీల, వైస్ చైర్మన్‌గా కందుల కోటేశ్వరరావు ఎన్నికయ్యారు.

పార్టీ బలాబలాలు

కోదాడ మునిసిపాలిటీలో 35 వార్డులు ఉన్నాయి. కాగా 2020లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి 25 మంది కౌన్సిలర్లు గెలుపుపొందగా, కాంగ్రెసు 8, టీడీపీ ఒకటి, సీపీఐ ఒకటి గెలుచుకున్నాయి. కాగా 25వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ చింతనాగమణి ఇటీవల మృతి చెందగా, ఆపార్టీ నుంచి 24మంది కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి చైర్‌పర్సన్‌గా వనపర్తి శిరీష, వైస్ చైర్మన్‌గా వెంపటి పద్మ ఉన్నారు. గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్‌కు చెందిన ఎనిమిది మంది కౌన్సిలర్లు కాంగ్రెసులో చేరారు. దీంతో ఆపార్టీ బలం 24 నుంచి 16కు తగ్గింది. అదేవిధంగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన మరో 11మంది కౌన్సిలర్లు కాంగ్రెసు వైపు మొగ్గు చూపటం, ఎన్నికలలో కాంగ్రెసు గెలవటంతో చైర్‌పర్సన్, వైస్‌పర్సన్‌పై అవిశ్వాసానికి కాంగ్రెసు రంగం సిద్ధంచేసింది. ఫలితంగా బీఆర్ఎస్‌కు ఐదుగురు కౌన్సిలర్లు మిగిలారు. శనివారం జరిగిన అవిశ్వాస తీర్మానానికి వారు హాజరుకాలేదు. దీంతో విశ్వాస పరీక్ష నల్లేరు మీద నడకలాగా సాగింది. కొత్తగా ఎంపికైన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లను పలువురు అభినందించారు.

హాలియాలో అవిశ్వాసం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

హాలియా, ఫిబ్రవరి 10: హాలియా మునిసిపాలిటీ చైర్మన్ వెంపటి పార్వతమ్మ శంకరయ్య, వైస్‌చైర్మన్ నల్లగొండ సుధాకర్‌లపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని మునిసిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు శనివారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ హాలియా మునిసిపాలిటీలో డ్రైనేజీ, మంచినీటి సమస్యలు అన్ని వార్డుల్లో ప్రధానంగా ఉన్నాయన్నారు. మునిసిపాలిటీ చైర్‌పర్సన్ వ్యక్తిగత కారణాలతో ఉన్నందున మునిసిపాలిటీలో సమావేశాలు ఏర్పాటు చేయక నాలుగు నెలలైందని అన్నారు. మునిసిపల్ సమావేశాలు ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండి పాలన మొత్తం అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. తక్షణమే చైర్మన్, వైస్‌చైర్మన్లపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో మునిసిపాలిటీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, వార్డు కౌన్సిలర్లు యడవల్లి అనుపమనరేందర్‌రెడ్డి, అన్నెపాక శ్రీనివాస్, గౌని సుధారాణిరాజారమేష్‌యాదవ్, పిల్లి చంద్రకళఆంజనేయులు, ప్రసాద్ నాయక్, తక్కెళ్లపల్లి ఎల్లమ్మ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్, తక్కెళ్లపల్లి సైదులు పాల్గొన్నారు.

పగలు రెక్కీ.. రాత్రి ఇళ్లల్లో దొంగతనాలు

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 10: పగలు రెక్కీ నిర్వహించి రాత్రి సమయాల్లో ఇళ్లలో దొంగతనాలు చేస్తున్న ఓ పాత నేరస్థుడిని సూర్యాపేట జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే బీకే శనివారం వెల్లడించారు. ఖమ్మంలోని పాండురంగాపురం సమీపంలోని బల్లెపల్లికి చెందిన పెయింటింగ్ పని చేసే సంపటి ఉమాప్రసాద్ శనివారం గతంలో దొంగతనం చేసిన సొమ్ముతో కొనుగోలు చేసిన స్కూటీపై సూర్యాపేటలోని ఎంజీరోడ్డులో గల శ్రీనివాస లాడ్జికి వచ్చాడు. 2017లో దొంగతనాలు చేసి సులువుగా డబ్బు సంపాదించాలని కేరళకు వెళ్లి అక్కడ లాడ్జిల్లో ఉంటూ పోర్ట్ పీఎస్, పెట్టహ్ పీఎస్ పరిధిలో దొంగతనాలు చేసి పోలీసులకు పట్టుపడ్డాడు. మూడు నెలలు జైలులో ఉన్న తర్వాత బెయిల్‌పైవచ్చాడు. 9 డిసెంబరు 2023 నుంచి దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. సూర్యాపేటలోని శ్రీనివాస లాడ్జిలో ఉంటూ పగటి పూట తాళం వేసిన ఇళ్లను రెక్కీ చేసి రాత్రి సమయంలో కట్టర్ సాయంతో తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి ఇంట్లో భద్రపరుచుకున్న వెండి, బంగారు ఆభరణాలు, నగదు అపహరించి హైద్రాబాద్‌కు వెళ్లి అక్కడ కొంత దాచుకుని మిగిలిన దానిలో అతడి మిత్రులైన ఖమ్మం జిల్లా పువ్వాడ ఉదయ్‌నగర్‌కు చెందిన కారు డ్రైవర్ తెలనాగి మురుగేష్, పాండురంగాపురానికి చెందిన కారు డ్రైవర్ మహ్మద్ అంజద్‌పాష, హైదరాబాద్‌లోని మల్కాజిగిరికి చెందిన విద్యార్థి రోషన్‌కుమార్‌సింగ్‌లకు ఇచ్చేవాడు. వస్తువులను కుదువపెట్టి ఆ డబ్బులతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడుతూ, విహార యాత్రలు చేస్తూ జల్సాలు చేస్తున్నారు. ఉమాప్రసాద్ సూర్యాపేటలో గతేడాది డిసెంబరు 13వ తేదీన క్రిష్ణాకాలనీ, విద్యానగర్, ఏవీ ఎన్‌క్లేవ్, అంజనాపురికాలనీ, భగత్‌సింగ్‌నగర్ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. అతడి వద్ద లభించిన స్కూటీతో పాటు కొన్ని ఆభరణాలు కూడా సూర్యాపేటలో చోరీ చేసినవి అని తెలిపాడు. చోరీ చేసిన వెండి, బంగారు ఆభరణాలు, విదేశీ నోట్లు, డైమండ్ నక్లెస్ ఖమ్మంలోని తన ఇంట్లో భద్రపరిచినట్లు తెలిపాడు. ఉమాప్రసాద్‌ను తీసుకుని పట్టణ పోలీసులు ఖమ్మంలోని నివాసానికి వెళ్లి మొత్తం 8తులాల బంగారు ఆభరణాలు, 5700 విదేశీ కరెన్సీ, స్కూటీ, బైక్, చోరీలకు ఉపయోగించిన కట్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థినుల జంట ఆత్మహత్యలపై స్పందనేదీ?

● అసెంబ్లీలో ఏ ఒక్కపార్టీ స్పందించక పోవడం సరికాదు ● బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



హాస్టల్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 10: భువనగిరి ఎస్సీ సంక్షేమ హాస్టల్ విద్యార్థినులు భవ్యశ్రీ, వైష్ణవి ఆత్మహత్యలు ప్రభుత్వం చేసిన హత్యేనని, సంక్షేమ హాస్టళ్ల నిర్వహణలో నాటి, నేటి ప్రభుత్వాలు చూపుతున్న వివక్షతోనే దారుణాలు జరుగుతున్నాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన జిల్లాకేంద్రంలోని హాస్టల్‌ను పరిశీలించి భవ్యశ్రీ, వైష్ణవి కుటుంబసభ్యులను పరామర్శించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య ఘటనను అసెంబ్లీలో ఏఒక్క పార్టీ సభ్యులు ప్రస్తావించకపోవడం అమానుషమని, ఆ ఇద్దరు బాలికలు పేద, బలహీన వర్గాలకు చెందినవారు కావడంతోనే మృత్యువులోనూ వివక్షకు గురవుతున్నారన్నారు. నాటి దిశ ఘటనపై స్పందించిన ప్రభుత్వం, అధికారులు, సమాజం, మీడియా నేటి భవ్యశ్రీ, వైష్ణవి ఆత్మహత్యలపై ఎందుకు స్పందించడం లేదన్నారు. పాలకులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తమ అక్రమాలు, భూ దందాలకోసం నిధులను దుర్వినియోగం చేస్తూ సంక్షేమ వసతి గృహాల నిర్వహణ, విద్యారంగాన్ని విస్మరిస్తుండడంతో లక్షలాది మంది విద్యార్థులు మానసిక రుగ్మత, అరకొర వసతులతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి మూడు నెలలు గడుస్తున్నా విద్యా, సంక్షేమ శాఖల మంత్రులు లేకపోవడం కాంగ్రెస్ చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకొని తొమ్మిది రోజులు గడుస్తున్నా దర్యాప్తు చేయని ప్రభుత్వం మాత్రం న్యాయం చేయాలని ఆందోళనలు చేసిన అన్ని పార్టీల కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం అమానుషమన్నారు. ప్రజా గొంతుకలను నొక్కి వేయడంలో మాజీ సీఎం కేసీఆర్ అనుసరించిన తీరునే నేటి సీఎం రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్నారనే దానికి కేసుల నమోదే ఉదాహరణ అని అన్నారు. సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ, గురుకుల, పాఠశాలల నిర్వహణ, పక్కా భవనాలు, బిల్లుల విడుదలలో ప్రభుత్వాలు చూపిన వివక్షతను తాళలేకే తాను ఉద్యోగానికి రాజీనామా చేశానని పేర్కొనాడు. విద్యార్థినుల ఆత్మహత్యపై పారదర్శకంగా విచారణ జరిపి దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించి ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. విద్యార్థినుల ఆత్మహత్య ఘటనపై ఈ నెల 12న హైదరాబాద్ సంక్షేమ భవన్ ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. పిల్లల ఆత్మహత్యపై తల్లిదండ్రులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. అనంతరం హాస్టల్ ప్రాంగణంలోనే విద్యార్థినుల తల్లిదండ్రులను పరామర్శించారు. న్యాయం జరిగే వరకూ బీఎస్పీ పోరాడుతుందని ఓదార్చారు. ఆయన వెంట బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఉప్పల జహంగీర్, నాయకులు ఉన్నారు.

మమ్మల్ని ఎవరూ సంప్రదించడం లేదు : మృతుల తల్లిదండ్రులు

తమ పిల్లలు ఆత్మహత్య చేసుకొని తొమ్మిది రోజులు గడుస్తున్నా ఇంత వరకు ఏ ఒక్క అధికారి మమ్మల్ని సంప్రదించడం లేదని భవ్యశ్రీ తల్లిదండ్రులు కోడి కృష్ణ, లలిత, వైష్ణవి తండ్రి గాదె రాజు ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం భువనగిరికి వచ్చిన వీరు పిల్లలు ఆత్మహత్య చేసుకున్న హాస్టల్ గదిని పరిశీలించి కన్నీరుమున్నీరయ్యారు. న్యాయం చేయాలంటూ డీసీపీ రాజేష్ చంద్రను కలిసేందుకు కార్యాలయానికి వెళ్లగా అతను అందుబాటులో లేరని తెలిపారు. ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం నివేదిక కోసం పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే ఎఫ్ఐఆర్ కాపీని ఇదివరకే అందజేశామని, పోస్టుమార్టం రిపోర్టును కోర్టు ద్వారా పొందాలని పోలీసులు సూచించారు. వారివెంట యాదవ సంఘం నాయకులు పుట్ట వీరేష్‌యాదవ్, సురేష్, కొడారి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

యాదాద్రి డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి బదిలీ

భువనగిరి టౌన్: భువనగిరి ఎస్సీ హాస్టల్‌లో ఆత్మహత్యకు పాల్పడిన భవ్యశ్రీ, వైష్ణవి ఉదంతంపై విచారణ చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి బదిలీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం శనివారం చేసిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆమెను జహీరాబాద్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య విచారణకు తాత్కాలిక బ్రేక్ పడే అవకాశాలు ఉన్నాయి.

ఉత్సాహంగా ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీలు





మహిళా జట్ల మధ్య కొనసాగుతున్న పోటీలు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 10 : తెలంగాణ 56వ సీనియర్స్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీలు యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు శనివారం మహిళా, పురుషుల జట్లు 14 మ్యాచ్‌లు జరిగాయి. మ్యాచ్‌లను క్రీడాభిమానులు ఉత్కంఠగా వీక్షిస్తూ ప్రోత్సహిస్తున్నారు. సీనియర్ క్రీడాకారులను, అసోసియేషన్ ప్రతినిధులను సత్కరించారు. పోటీల నిర్వాహణ తీరును పలువురు ప్రశంసించారు.

తెలంగాణలోనే తొలి సారిగా

మ్యాట్‌లపై తెలంగాణలోనే తొలిసారిగా భువనగిరిలో రాష్ట్ర స్థాయి ఖోఖో మీట్‌ను నిర్వహిస్తుండడంపై క్రీడాకారులు, కోచ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో అన్ని స్థాయిల పోటీలు మట్టి గ్రౌండ్లలోనే జరగ్గా, క్రీడాకారుల ప్రాక్టీస్ కూడా స్థానిక గ్రౌండ్లలోనే జరుగుతుండడంతో మ్యాట్‌లపై జరిగే జాతీయస్థాయి టోర్నీలల్లో రాష్ట్ర క్రీడాకారులు ప్రతిభ చూపలేకపోతున్నారని కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తొలిసారిగా మ్యాట్‌లపై నిర్వహించిన తీరు అభినందనీయమని ఇదే తరహాను రాష్ట్రమంతటా కొనసాగించాలని కోరుతున్నారు.

రెండో రోజు మ్యాచ్‌లు ఇలా..

మహిళల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు ఖమ్మంపై 10-8 పాయింట్లు, రంగారెడ్డి జట్టు ఆదిలాబాద్‌పై 8-5, హైదరాబాద్ జట్టు మెదక్‌పై 13-6, నల్లగొండ జట్టు నిజామాబాద్‌పై 9-3, మహబూబ్‌నగర్ జట్టు వరంగల్‌పై 9-1, రంగారెడ్డి జట్టు కరీంనగర్‌పై 13-2, ఖమ్మం జట్టు నిజామాబాద్‌పై 12-11, ఆదిలాబాద్ జట్టు మెదక్‌పై 6-5 పాయింట్ల తేడాతో గెలుపొందాయి. పరుషుల విభాగంలో కరీంనగర్ జట్టు మెదక్‌పై 15-11, వరంగల్ జట్టు నల్లగొండపై 11-10, ఆదిలాబాద్ జట్టు నిజామాబాద్‌పై 15-8, ఖమ్మం జట్టు మహబూబ్‌నగర్‌పై 12-8, వరంగల్ జట్టు హైదరాబాద్‌పై 14-12, కరీంనగర్ జట్టు రంగారెడ్డిపై 15-14 పాయింట్ల తేడాలో తెలుపొందాయి.

నల్లగొండలో రైల్వేట్రాక్‌పై
పసికందు మృతదేహం

● పోలీసుల అదుపులో పాప తండ్రి



రైల్వేట్రాక్‌పై పసికందు మృతదేహం

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 10: అప్పుడే పుట్టిన పసికందు మృతదేహాన్ని రేల్వేట్రాక్‌పై వదిలి వెళ్లిన సంఘటన నల్లగొండ పట్టణ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వేపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నార్కట్‌పల్లి మండలం తొండ్లాయి గ్రామానికి చెందిన ఓ గర్భిణి పది రోజుల క్రితం ప్రసవానికి జిల్లా కేంద్ర ఆసుపత్రికి వచ్చింది. శుక్రవారం ఆమె కవలలకు జన్మనిచ్చింది. అందులో ఒక పాప మృతి చెందటంతో సదరు మహిళ భర్త పసికందు మృతదేహాన్ని పానగల్ ఫ్లైఓవర్ బిడ్జి సమీపంలోని ట్రాక్‌పై వదిలివెళ్లిపోయాడు. అయితే ట్రాక్‌మన్ పట్టాలపై పసికందు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అనంతరం ఆస్పత్రిలో విచారించగా పాప నార్కట్‌పల్లి మండలానికి చెందిన దంపతులకు జన్మించినట్లు గుర్తించారు. ఈ మేరకు పసికందు తండ్రిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు రైల్వే ఎస్‌హెచ్‌వో సాలకమ్మ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

● శాలిగౌరారం మండలం పెర్కకొండారంలో ఘటన



రాజు (ఫైల్ ఫొటో)

శాలిగౌరారం, ఫిబ్రవరి 10: అనుమానాస్పద స్థితిలో ఒక యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన శాలిగౌరారం మండల పెర్కకొండారంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఐలయ్య, మృతుడి చంద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందని ధర్నెబోయిన రాజు (42) గ్రామంలో కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమార్తె వివాహం కాగా, మరో కుమార్తె ఇంటర్ చదువుతుంది. ఇదిలా ఉంటే రాజుకు మానసిక స్థితిగా సరిగా ఉండకపోవడంతో పాటు మద్యానికి బానిసైయ్యాడు. వైద్యులకు సంప్రదించినా రాజు మందులు వేసుకునేందుకు నిరాకరించేవాడు. ద్రావకరూపంలోనైనా ఇవ్వాలని వైద్యుల సూచించారు. ఈ విషయాన్ని రాజు స్నేహితులైన పులగం ధన శేఖర్‌రెడ్డి, నూక గణేష్‌లకు అతని భార్య రమణ తెలియజేసింది. ఎలాగైనా మందులు వేయాలని కోరింది. ఇదిలా ఉంటే రమణ హైదరాబాద్‌లో ఉంటున్న పెద్ద కుమార్తె దగ్గరకు పదిరోజుల క్రితం వెళ్లింది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు రాజును ధన శేఖర్‌రెడ్డి, గణేష్ కలిసి ఇంటి నుంచి బయటకు తీసుకెళ్లారు. మద్యంలో మందులు కలిసి తాగించారు. దీంతో అతని ఆరోగ్యం క్షీణించడంతో అతడిని నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రాజు శనివారం తెల్లవారుజామున రాజు మృతి చెందారు. ఇదిలా ఉంటే మృతుని తండ్రి చంద్రయ్య తన కోడలికి ధన శేఖర్‌రెడ్డికి వివాహేతర సంబంధం ఉందని, కుమారుడు రాజు మృతికి కోడలు రమణ, పులగం ధనశేఖర్‌రెడ్డి, నూక గణేష్‌లే కారణమని ఆరోపించారు. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడన్న నెపంతో ధన శేఖర్‌రెడ్డి, నూక గణేష్‌తో కలిసి రాజును చంపారని అనుమానం ఉందని, వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఐలయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అవయవదానంతో స్ఫూర్తి



మజ్జిగ బీరయ్య(ఫైల్)

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 10 : బ్రెయిన్‌డెడ్ అయిన కుటుంబ పెద్ద అవయవాలను దానం చేసి స్ఫూర్తిగా నిలిచారు మండల కేంద్రానికి చెందిన మజ్జిగ బీరయ్య కుటుంబ సభ్యులు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మజ్జిగ బీరయ్య(58) ఆరోగ్యం బాగాలేకపోవడంతో నాలుగు రోజుల క్రితం ఉప్పల్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ బీరయ్య గుండెకు స్టంట్ వేశారు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ 24 గంటలు పరీక్షలు చేసిన తర్వాత శనివారం తెల్లవారుజామున బీరయ్యకు బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు కుటుంబసభ్యులకు తెలిపారు. అనంతరం అవయవదానంపై వైద్యులు బీరయ్య కుటుంబసభ్యులకు అవగాహన కల్పించడంతో అందుకు వారు అంగీకరించారు. దీంతో జీవన్ దాన్ ట్రస్ట్ ద్వారా బీరయ్య శరీరం నుంచి గుండె, కిడ్నీలు, లివర్‌లను తీసుకున్నట్లు సభ్యులు తెలిపారు. దీంతో అవయవదానం చేసిన బీరయ్య భౌతికకాయం వద్ద ఆసుపత్రి సిబ్బంది సెల్యూట్ చేసి నివాళులర్పించారు. స్వగ్రామం చేరుకున్న బీరయ్య భౌతిక కాయంపై పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

క్రీడారంగాన్ని విస్మరించిన బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న టీపీసీసీ నాయకుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

అడ్డగూడూరు, శనివారం 10 : పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం క్రీడారంగాన్ని, క్రీడాకారులను పూర్తిగా విస్మరించిందని దీంతో క్రీడాకారులు గుర్తింపుకు నోచుకోలేదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని డీ రాపాక గ్రామంలో 2014-15 పదో తరగతి బ్యాచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు అందజేసి, మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దైద పురుషోత్తంరెడ్డి, మాజీ సర్పంచులు లింగాల సుధాకర్‌రెడ్డి, ఆలకుంట్ల నర్సయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పరైపాటి యుగందర్, చేడే మహేందర్, చేడె అంబేద్కర్, మాజీ ఎంపీటీసీ గురుమూర్తి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు చిప్పలపల్లి పరుశురాములు, నాయకులు లింగాల నర్సిరెడ్డి, లింగాల రాంరెడ్డి, మల్లారెడ్డి, రాపోలు యాదగిరి, ఎస్‌ఎస్‌సీ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 10 : విద్యార్థుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని దివీస్ సంస్థ సీఎస్సార్ ఫండ్ ఇన్‌చార్జి వల్లూరి వెంకటరాజు అన్నారు. శనివారం చౌటుప్పల్ మునిసిపాలిటీలోని తంగడపల్లి జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో దివీస్ సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. అంతేకాకుండా 458 మంది విద్యార్థులకు రూ.3.40 లక్షల విలువైన స్కూల్ బ్యాగులు, పాదరక్షలు, మందులను అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి జయంత్ కుమార్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు భార్గవి, భాగ్యమ్మ, దివీస్ అధికారి సాయికృష్ణ పాల్గొన్నారు.

కారులో పరారైంది పందుల దొంగలు

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 10 : చౌటుప్పల్ మండలం జైకేసారంలో యువకులపై దాడి చేసి సినీఫక్కీలో తప్పించుకున్న దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కారు నెంబరు ఆధారంగా నిందితులను గుర్తించి, వారిని విచారించగా వారు పందులను దొంగతనానికి వచ్చినట్లు అంగీకరించినట్లు తెలిసింది. గ్రామస్థులు దాడి చేస్తారనే భయంతో పారిపోయినట్లు తెలిపినట్లు సమాచారం. కాగా జైకేసారంలో గత నెల 22 పందులను అపహరించినట్లు జైకేసారం గ్రామానికి చెందిన ఒంటెద్దు కృష్ణవేణి, ఒంటెద్దు వెంకటయ్యలు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఇబ్రహీంపట్నంకు చెందిన వ్యక్తులు తమ పందులు అపహరించినట్లు తెలిపారు.

సబ్సిడీ గ్యాస్ దరఖాస్తుల్లో ముమ్మరంగా తప్పుల సవరణ

మోత్కూరు, ఫిబ్రవరి 10 : మహాలక్ష్మీ పథకంలో త్వరలోనే రూ.500లకు వంట గ్యాస్ సిలిండర్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రజా పాలనలో సబ్సిడీ గ్యాస్ సిలిండర్ కోసం చేసుకున్న దరఖాస్తుల్లో తప్పులు ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ప్రభుత్వం సంబంధిత అధికారులకు వెనక్కు పంపింది. గ్యాస్ కనెక్షన్ నెంబరు తప్పు రాయడం, ఇంటి పేరు తేడా ఉండటం, గ్యాస్ కనెక్షన్ పురుషుల పేరున ఉండగా మహిళలు దరఖాస్తు చేసుకోవడం లాంటి వాటిని పరిశీలన కోసం వెనక్కు పంపారని స్థానిక అధికారులు చెబుతున్నారు. మోత్కూరు మునిసిపాలిటీలో సుమారు 1,800 దరఖాస్తులు పరిశీలన కోసం వచ్చాయని మునిసిపల్ కమిషనర్ సీ శ్రీకాంత్, మండలంలో 2038 దరఖాస్తులు పరిశీలన కోసం వచ్చాయని ఎంపీడీవో మనోహర్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తుదారుల ఇళ్లకు పంపి, ఫోన్లు చేసి వివరాలను సరిచేస్తున్నామని వారు తెలిపారు. ఈ నెల 12లోగా అన్ని దరఖాస్తులను సవరిస్తామన్నారు.

సీపీఆర్‌తో నిలిచిన ప్రాణాలు

మహిళ పరిస్థితిని చూసి సీపీఆర్ చేసిన ఎస్‌ఐ మహేందర్‌లాల్



మహిళకు సీపీఆర్ చేస్తున్న ఎస్‌ఐ మహేందర్‌లాల్

వలిగొండ, ఫిబ్రవరి 10: గుండెపోటుకు గురైన మహిళకు ఓ ఎస్‌ఐ సీపీఆర్ చేసి ప్రాణాలు రక్షించాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం మన్నెవారిపంపునకు చెందిన బోయిన వెంకటమ్మ నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి చెర్వుగట్టు రామలింగేశ్వరస్వామి దైవదర్శనానికి వెళ్లింది. శనివారం తిరుగు ప్రయాణంలో ఆర్టీసీ బస్సులో వస్తుండగా వలిగొండ మండలం నాగారం వద్దకు రాగానే సదరు మహిళకు ఛాతిలో నొప్పి వచ్చి ఇబ్బందిపడడంతో మండల కేంద్రానికి రాగానే బస్సు దిగింది. వెంటనే కూలబడింది. అయితే అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ మహేందర్‌లాల్ ఆ బాధితురాలి పరిస్థితిని గమనించి సమయస్ఫూర్తితో సీపీఆర్ చేశారు. అనంతరం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆ బాధితురాలికి డాక్టర్ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమెతో పాటు మరో ఇద్దరు మహిళలు ఉన్నారు. సకాలంలో ఓ ప్రయాణికురాలికి సీపీఆర్ నిర్వహించి ప్రాణాలను కాపాడిన ఎస్‌ఐని పలువురు అభినందించారు. ఇదిలా ఉండగా వెంకటమ్మకు గుండెపోటుకు గురైందని భువనగిరి ఏరియా ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారని 108 వాహనం పైలెట్ కాలయ్య తెలిపారు. ప్రస్తుతం ఆమె భువనగిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

లక్ష్మీనృసింహుడి సన్నిధిలో భక్తుల కోలాహలం



అలంకార వెండి జోడు సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 10 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శనివారం యాత్రాజనుల పూజల కోలాహలం నెలకొంది. ఇష్టదైవాల దర్శనాల కోసం యాత్రాజనులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తుల సంచారంతో కొండకింద కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, బస్టాండ్లు, కొండపైన ఆలయ తిరువీధులు, ఉభయదర్శన క్యూలైన్లు, ప్రధానాలయం, ప్రసాదాల విక్రయశాల తదితర ప్రాంతాలు సందడిగా కనిపించాయి. ధర్మదర్శనాల్లో రెండు గంటలు, ప్రత్యేక దర్శనాల్లో గంట సమయం పట్టినట్టు భక్తులు తెలిపారు. సుమారు 20 వేల మందికి పైగా యాదగిరిక్షేత్రాన్ని సందర్శించారని, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.24,18,100 ఆదాయం వచ్చినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు. కొండకింద అనుబంధ పాతగుట్ట ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. పాతగుట్ట ఆలయంలో స్వయంభువులను దర్శించుకున్న యాత్రాజనులు ఆలయ ఆవరణలో పిల్లాపాపలతో సేదతీరారు. ఇదిలా ఉండగా యాదగిరీశుడికి నిత్యవిధి కైంకర్యాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరుడికి, మహామండపంలోని స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి.

చీకటి ఒప్పందంలో భాగంగానే ప్రాజెక్టుల అప్పగింత



యాదగిరిగుట్టలో బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ విప్ సునీత, నాయకులు

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 10 : కేంద్రంలోని బీజేపీతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకున్న చీకటిఒప్పందంలో భాగంగా కేఆర్‌ఎంబీ పరిధిలోకి కృష్ణా ప్రాజెక్టులు వెళ్లాయని, ప్రాజెక్టులను రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని బీఆర్‌ఎస్ భువనగిరి అసెంబ్లీ సమన్వయకర్త, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు అన్నారు. శనివారం భూదాన్‌పోచంపల్లిలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన చలో నల్లగొండ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ ఈ నెల 13న నల్లగొండ నిర్వహించే భారీ బహిరంగ సభకు రైతులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.సమావేశంలో సమావేశానికి జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు జిట్టా బాలకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, వైస్ చైర్మన్ బాత్క లింగస్వామియాదవ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సీత వెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ తరహాలో ఉద్యమించాలి

యాదగిరిగుట్ట రూరల్: కృష్ణాజలాలను దక్కించుకోవడానికి తెలంగాణ తరహాలు ఉద్యమించాలని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గుట్ట బీఆర్‌ఎస్ భవనంలో ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించే చలోనల్లగొండ పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, పార్టీ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్ గౌడ్, జడ్పీటీసీ వైస్‌చైర్మన్ బిక్కునాయక్, పార్టీ గుట్ట మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, నాయకులు మిట్ట వెంకటయ్యగౌడ్, పాపట్ల నరహరి, ఆలేరు మునిసిపల్ చైర్మన్ శంకరయ్య, జడ్పీటీసీ సభ్యురాలు తోటకూరి అనురాధబీరయ్య, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మరో పోరాటం చేయాల్సిందే

చౌటుప్పల్ టౌన్: కృష్ణాజలాల్లో హక్కు కోసం మరో పోరాటం చేయాల్సిందేనని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి కోరారు. చౌటుప్పల్‌లో పట్టణ, మండల బీఆర్‌ఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఆర్‌ఎంబీకి అప్పగింతతో కృష్ణానదిపై అన్నిహక్కులు కేంద్రం చేతుల్లోకి వెళ్లిపోతాయన్నారు. సమావేశంలో బహిరంగ సభ మునుగోడు ఇన్‌చార్జి శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు డిల్లీ మాధవరెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఊడుగు మల్లేశ్, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బొంగు జంగయ్య, బీఆర్‌ఎస్ మునిసిపాలిటీ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో చలో నల్లగొండ సభ పోస్టర్‌ను పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల అంజయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిప్పలపల్లి మహేందర్‌నాథ్, సింగిల్ విండో చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ పూలపెల్లి జనార్ధన్‌రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు ఆంటోని, పట్టణ అధ్యక్షుడు దేవగిరి, గూడెపు పరమేష్ తదితరులు ఉన్నారు.

పీవీకి భారతరత్న గర్వకారణం



చౌటుప్పల్‌లో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

భువనగిరి టౌన్ / చౌటుప్పల్ టౌన్ / సంస్థాన్‌నారాయణపురం, ఫిబ్రవరి 10 : మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న అవార్డు రావడం తెలుగు ప్రజలకు గర్వకారణమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం భువనగిరిలో నిర్వహించిన సంబరాలలో ఆయన మాట్లాడారు. బహుభాష కోవిదుడు, దేశ ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించడం హర్షనీయమన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆకవరం రమేష్, పాలెం రామకృష్ణ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు పాదరాజు ఉమా శంకర్‌రావు, చందుపట్ల విశ్వేశ్వరరావు, రాంమోహన్‌రావు, రామేశ్వరరావు, శ్యాంమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. చౌటుప్పల్ పట్టణంలో గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు నిర్వహించారు. బీజేపీని మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి ఇన్‌చార్జి గుజ్జుల సురేందర్‌రెడ్డి, బీజేపీ మునిసిపాలిటీ అధ్యక్షుడు ఊడుగు వెంకటేష్, అభిమాన్ కన్వీనర్ కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, నాయకులు ఆలె చిరంజీవి, చీకూరి వెంకటేశ్, బత్తుల జనార్థన్, బుడ్డ సురేష్, కొండూరు దుర్గయ్య, శివ ప్రసాద్, చెరుకు శివ, ఎల్లంకి రవి, మొగులయ్య పాల్గొన్నారు. సంస్థాన్‌నారాయణపురంలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు దోనూరు వీరారెడ్డి కోరారు. పీవీకి భారతరత్న ప్రకటించడాన్ని పురస్కరించుకొని ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి సూరపల్లి శివాజీ, నాయకులు బచ్చనగోని దేవేందర్, వంగరి రఘు, భాస్కర నరసింహ, ఆత్కూరి గిరి, దాసోజు వెంకటాచారి, ఆత్కూరి రాములు, సుర్వి రాజుగౌడ్, జక్కర్తి భిక్షం పాల్గొన్నారు.

ఆదర్శ కళాశాలగా తీర్చిదిద్దుతాం: కన్వీనర్ జిట్టా

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 10 : భువనగిరిలోని సీఎస్ఎన్ఆర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను ఆదర్శ కళాశాలగా తీర్చిదిద్దుతామని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్, తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్తిస్థాయి మౌలిక వసతులు, విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అందించే లక్ష్యంతో పూర్వ విద్యార్థుల సంఘం పనిచేస్తుందన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ పాపిరెడ్డి, సంఘం ప్రతినిధులు పోత్నకక్ ప్రమోద్‌కుమార్, బర్రె జహంగీర్, కే సోమయ్య, కొలువుల వివేకానంద, ఎస్కే హమీద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

బోధన సిబ్బంది పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 10 : రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్సీఈఆర్టీ)లో డిప్యూటేషన్, ఓడీ విధానంపై పనిచేసేందుకు అర్హులైన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల నుంచి పాఠశాల విద్యాశాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో కే నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరితో పాటు బోధనలో 10 ఏళ్ల అనుభవం ఉన్న స్కూల్ అసిస్టెంట్లు కూడా అర్హులని, ఈ నెల 11 నుంచి 17వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పోస్ట్‌గ్రాడ్యూయేషన్ చేయడంతో పాటు ఎంఈడీ పూర్తి చేసి ఉండాలన్నారు. అదేవిధంగా వచ్చే మార్చి 1నాటికి 58 ఏళ్ల నిండి ఉండాలని, ఆసక్తి, అర్హత గల స్కూల్ ఎడ్యూకేషన్ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మనస్తత్వ శాస్త్రం, తత్వ శాస్త్రం, సామాజిక శాస్త్రం, హిందీ, ఐసీటీ విద్యాంశాల్లో ఒకటి చొప్పున, ఉర్దూ విభాగంలో రెండు చొప్పున, గణిత శాస్త్రం, భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం, సాంఘిక శాస్త్రాలతో పాటు తెలుగు, ఆంగ్లం, శారీరక విద్య విభాగాల్లో మూడు చొప్పున ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఆలేరు మట్టిబిడ్డల త్యాగం అజరామరం

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 10 : ఆలేరు మట్టి బిడ్డల త్యాగం అజరామరమని ప్రముఖ వాగ్గేయకారుడు, కవి రచయిత యోచన అన్నారు. శనివారం ఆలేరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాటి సాయుధ పోరాట ఉద్యమానికి, తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ఆరాధ్యంగా నిలిచింది ఆలేరు ప్రాంతమన్నారు. కార్యక్రమంలో ద్రావిడ సాహిత్య, సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రామంచ భరత్, ఆలేరు మాజీ సర్పంచ్ ఆకవరం మోహన్‌రావు, ఎర్రోజు రాజు, బోడ శ్రీకాంత్, రమేష్, తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: కౌన్సిలర్లు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 10 : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మునిసిపల్ కౌన్సిలర్లు తంగెళ్లపల్లి శ్రీవాణి, పడిగల రేణుక, పంగరెక్క స్వామి అన్నారు. శనివారం భువనగిరిలోని 8, 23, 35 వార్డుల్లో వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. బోరు బావిని ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వ గ్యారెంటీ పథకాలపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ కమిషనర్ బీ నాగిరెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు ఇట్టబోయిన సబితా గోపాల్, నాయకులు రవికుమార్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

మాసాయిపేట పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

యాదగిరిగుట్ట రూరల్, ఫిబ్రవరి 10 : మండలంలోని మాసాయిపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి కవిత విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ మండల కోఆప్షన్ సభ్యుడు యాకూబ్, వార్డు సభ్యులు కళ్లెం విజయజహంగీర్‌గౌడ్, సుంచు వినోద్ శనివారం ఎంపీడీవోకు ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 ఏళ్లుగా గ్రామకార్యదర్శిగా కొనసాగుతూ సరైన సమయానికి రాకుండా కనీసం కుల, మరణ ధ్రువీకరణ పత్రాలు త్వరగా ఇవ్వడానికి ఇబ్బందులు పెడుతోందని, తక్షణమే ఆమెను బదిలీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు శివరాంచరణ్ ఎంపిక

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 10 : చౌటుప్పల్ పట్టణంలోని బ్రిలియంట్ స్కూల్ తొమ్మిదవ తరగతి విద్యార్థి బీ శివరామ్‌చరణ్ రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికయ్యారు. శివరాంచరణ్ రూపొందించిన సౌండ్ స్కోప్ రాష్ట్ర స్థాయిలో ఎంపికైనట్టు స్కూల్ కరస్పాండెంట్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. విద్యార్థి శివరాంచరణ్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు.

తప్పిపోలేదు.. కిడ్నాప్ చేశారు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 10: భువనగిరిలో నిజామాబాద్ బాలుడి మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించారు. ఆ బాలుడు తప్పిపోలేదని, కిడ్నాప్ చేశారని పోలీసులు తేల్చారు. కిడ్నాప్‌కు గురైన ఆరేళ్ల బాలుడిని పోలీసులు శనివారం క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ కే సురేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లాకు చెందిన రాత్లారాం రెడ్డి గ్రామానికి చెందిన బైండ్ల చిన్నరాజు, రాధమ్మ దంపతులు. రాధమ్మ అక్క రాజేశ్వరీతో పాటు వారి పిల్లలు ఉపాధి వెతుక్కుంటూ ఈ నెల 4వ తేదీ రాత్రి భువనగిరికి చేరుకున్నారు. ప్రయాణ బడలికతో అలసిపోయిన వారందరూ బస్టాండ్ ఎదురుగా ఓ దుకాణం ముందు ఆ రాత్రి పడుకున్నారు. అయితే 5వ తేదీన తెల్లవారుజామున అందరూ లేచే సరికి రాజు, రాధమ్మ దంపతుల ఆరేళ్ల కుమారుడు సిద్ధిరాములు కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురై చుట్టుపక్క వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భువనగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గుర్రాలదండి చిన్నపలుగుతండాకు బానోతు మోహన్‌కు ఇద్దరు కుమార్తెలు ఉండగా అనారోగ్యం కారణంగా భార్య గర్భసంచిని మూడేళ్ల కిందట తొలగించారు. కానీ ఆ దంపతులు కుమారుడు లేడని ఆవేదనకు గురయ్యేవారు. ఈ క్రమంలో తమకు ఓ బాలుడు కావాలని తనకు తెలిసిన వారందరికీ మోహన్ చెబుతుండేవాడు. బాలుడిని తెచ్చిఇచ్చిన వారికి బహుమతులు కూడా ఇస్తామని తెలిపేవాడు. అయితే భువనగిరి పట్టణ శివారులోని ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న తన బంధువులైన భువనగిరి పట్టణం రాయగిరికి చెందిన పాల్య విజయ, ఓరుగంటి శమంతతో కూడా కుమారుడి కోసం మోహన్ గతంతో పలుసార్లు ప్రస్తావించాడు. ఈ క్రమంలో 5వ తేదీన వారిద్దరూ గ్లాస్‌ఫ్యాక్టరీకి వెళ్లేందుకు భువనగిరి బస్టాండ్ వద్ద ఆటో కోసం ఎదురు చూస్తుండగా సిద్ధిరాములు ఒంటరిగా బస్టాండ్‌లోకి వెళ్తుండడాన్ని గమనించి కిడ్నాప్ చేసేందుకు ప్రణాళిక రూపొందించుకొని మోహన్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా అతడు అంగీకారం తెలిపాడు. ఆ వెంటనే ఆ ఇద్దరు మహిళలు సిద్ధిరాములుకు చిప్స్‌ప్యాకెట్ ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా వద్దకు తీసుకువెళ్లారు. అప్పటికే అక్కడ బైక్‌పై సిద్ధంగా ఉన్న మోహన్‌కు సిద్ధిరాములును అప్పగించి అతడి నుంచి రూ.2వేలు తీసుకున్నారు. సిద్ధిరాములుని మోహన్ తన ఇంటికి తీసుకెళ్లి దాచిపెట్టాడు. ఈ మేరకు సిద్ధిరాములు మిస్సింగ్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి చేపట్టిన దర్యాప్తులో సిద్ధిరాములు కిడ్నాప్ ఉదంతం వెలుగుచూసింది. ఈ మేరకు మోహన్‌తో పాటు ఇద్దరు మహిళలను శనివారం ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ వద్ద అరెస్ట్ చేసి అతడి ఇంట్లోని సిద్ధిరాములును స్వాధీనం చేసుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. కిడ్నాప్ చేసిన విజయ, శమంతతో పాటు ప్రోత్సహించిన మోహన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. బాలుడి కిడ్నాప్ కేసులను ఐదు రోజుల్లో ఛేదించిన భువనగిరి పోలీసులను రాచకొండ కమిషనర్ జీ సుధీర్ బాబు, డీసీపీ ఎం రాజేష్‌చంద్ర అభినందించారు. ఏసీపీ ఎస్ వెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో పట్టణ ఇన్‌స్పెక్టర్ కే సురేష్‌కుమార్, ఎస్‌ఐ సీహెచ్ నాగరాజు, సిబ్బంది కొండల్‌రెడ్డి, రమేష్ తదితరులు కేసును ఛేదించిన వారిలో ఉన్నారు.

చికిత్సపొందుతూ

గుర్తుతెలియని వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట రూరల్, ఫిబ్రవరి 10 : యాదగిరిగుట్ట పట్టణంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. శనివారం స్థానిక సీఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక సబ్‌రిజిస్టర్ కార్యాలయం ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం సాయంత్రం స్పృహతప్పి పడిపోయిఉన్నాడు. గమినించిన స్థానిక హెడ్ కానిస్టేబుల్ రంగారావు వెంటనే 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదేరాత్రి 9.30గంటలకు మృతి చెందాడు.మృతిని ఒంటిపై నల్లని తెలుపు కలర్ చొక్కా, నల్లని పాయింట్ ధరించి గడ్డం, మీసాలు పెంచిన ఆనవాళ్లు ఉన్నాయి. కేసు నమోదు చేసి మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామని, సంబంధికులు ఎవరైనా సమాచారం తెలిస్తే 8712662806కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు.

చౌటుప్పల్ ఆర్డీవోగా శేఖర్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 10 : చౌటుప్పల్ ఆర్డీవోగా వీ శేఖర్‌రెడ్డిని నియమిస్తూ సీసీఎల్ఏ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్న శేఖర్‌రెడ్డిని చౌటుప్పల్ ఆర్డీవోగా నియమించారు. చౌటుప్పల్ ఆర్డీవోగా పని చేసిన జగన్నాథరావును శేఖర్‌రెడ్డి స్థానంలో నియమించారు. కాగా, శేఖర్‌రెడ్డి సోమవారం బాధ్యతలను స్వీకరించనున్నారు.



మోత్కూరు: మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ స్థాపించిన లక్ష్మీనర్సింహాస్వామి ప్రమాద బీమా(నర్సన్న బీమా) కుటుంబానికి దీమాగా ఉంటుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంతి నర్సింహారెడ్డి అన్నారు. బీజేపీ మోత్కూరు పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బీమా పాలసీదారుల నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గౌరు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు పోచం సోమయ్య, జక్క మోహన్‌రెడ్డి, సజ్జనం మనోహర్ పాల్గొన్నారు.

భువనగిరి టౌన్ : జిల్లా కేంద్రంలోని నల్లగొండ చౌరస్తా వద్ద ఈ నెల 25న ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు హిందూవాహిని జిల్లా, పట్టణ అధ్యక్షుడు శివగణేష్, ఊదరి రామరాజు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠాపన పోస్టర్‌ను ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంగచాలక్ బాదం ప్రకాష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ విడుదల చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు ఉదయగిరి విజయ్, రత్నపురం బలరాం, పంగరెక్క స్వామి, నాయకులు పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన సీఐ వేణుగోపాల్‌రావును ఆలేరులో కొలనుపాకకు చెందిన మత్స్య సహకార సంఘం నాయకులతో పాటు కాంగ్రెస్ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులు ఎండీ బాబా సన్మానించారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షులు శంకర్, నాయకులు తదితరులు ఉన్నారు.

భువనగిరి రూరల్: హన్మాపురం జడ్పీహైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు యువ టీం ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల అసోసియేషన్(జీటీఏ) జిల్లా అధ్యక్షుడు పాశం కృష్ణమూర్తి, యువ టీం కన్వీనర్ సూదగాని రాజు, ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, సభ్యులు పట్నం ప్రణయ్, జే వరుణ్ తదితరులు ఉన్నారు.

చౌటుప్పల్ టౌన్ : దేశవ్యాప్తంగా ఈ నెల 16 న నిర్వహించే కార్మిక సమ్మె, గ్రామీణ బంద్ ను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు డిల్లీ మాధవ రెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం కోరారు. చౌటుప్పల్ పట్టణంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పాషా, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శంకర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బూరుగు కృష్ణా రెడ్డి, చీరిక సంజీవ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు గంగదేవి సైదులు, నాయకులు పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: అయోధ్యలో రామమందిరం నిర్మాణం, ప్రారంభానికి కృషి చేసిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ ఆలేరుకు చెందిన ఆర్మీ రిటైర్డ్ కెప్టెన్ ఎంఎస్ శంకర్ ఉత్తరం రాశారు. మందిర నిర్మాణంతో ఆదర్శ ప్రధానిగా నిలిచారని కొనియాడారు.

మోటకొండూరు: ఎమార్పీఎస్ ఎటీజీ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోటకొండూరుకు చెందిన వంగపల్లి చిరంజీవి, గౌరవ అధ్యక్షుడిగా గంధమల్ల చంద్రయ్యతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల రమేష్, జిల్లా ప్రధానకార్యదర్శి బొట్ల శ్రీనివాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బైరపాక నాగరాజు, రమేష్ పాల్గొన్నారు

.రామన్నపేట: మండలంలోని బోగారం ప్రాథమికొన్నత పాఠశాల విద్యార్థులకువ్యాపారవేత్త కూనూరు సాయికుమార్‌గౌడ్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మన్ కడారి పాపయ్య, గ్రామ యువకులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : భూదాన్‌పోచంపల్లి ఎస్‌ఐగా భాస్కర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ రూరల్ ఎస్‌ఐగా పనిచేసిన భాస్కర్‌రెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన విక్రంరెడ్డి రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్ సైబర్‌క్రైంకు బదిలీ అయ్యారు.

అడ్డగూడూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గోవిందపురం గ్రామానికి చెందిన గోవిందు జోజప్పకు రూ.2.50 లక్షల ఎల్‌వోసీ చెక్కును ఎమ్మెల్యే మందుల సామేలు హైదరాబాద్‌లో అందజేశారు.

భువనగిరి రూరల్ : సమాజ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కే నారాయణరెడ్డి విద్యార్థులకు సూచించారు. భువనగిరి పట్టణంలోని జీనియస్ హైస్కూల్‌లో 12వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ బొజ్జ సూర్యనారాయణరెడ్డి, చైర్మన్ పడాల శ్రీనివాస్, ట్రెజరర్ తోట శ్రీధర్, ఎంఈవో నాగవర్ధన్‌రెడ్డి, ఏవో రవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండలకేంద్రంలో ఆదర్శ రజక నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎలిమినేటి మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఎలిమినేటి నరేష్, ప్రధానకార్యదర్శిగా పైళ్ల ప్రశాంత్‌తో పాటు కమిటీని ఎన్నుకున్నారు.

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని దోతిగూడెంలో ఈ నెల 16న జరిగే గ్రామీణబంధు, దేశవ్యాప్త సమ్మెను కరపత్రాలను, వాల్‌పోస్టర్లను వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, ప్రసాదం విష్ణు ఆవిష్కరించి, మాట్లాడారు.